మాస్టార్ ఇల్లే సైన్స్ మ్యూజియం

శాస్త్ర విజ్ఞానాన్ని విద్యార్థులకు విపులంగా నేర్పేందుకు ఆ సైన్స్ మాస్టార్ ఇంటినే సైన్స్ మ్యూజియంగా మార్చేశారు. చిన్నతనం నుంచి ఆ సబ్జెక్ట్‌పై ఉన్న మక్కువ అనేక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసింది. విద్యార్థుల కోసం సొంత నిధులు సైతం ఖర్చు చేస్తున్నారు. ఆయనే పొదలకూరు జెడ్పీ హైస్కూల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసే ఏవీ సుధాకర్.

- బడిలో సైన్స్ క్లబ్ ద్వారా పిల్లలకు పాఠాలు
- పర్యావరణ హితంపై పలు కార్యక్రమాలు
- జిల్లాస్థాయిలో పురస్కారం


సుధాకర్ ఇంట్లో ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియం

పొదలకూరు: విద్యార్థులకు చదువు చెప్పడంతోనే తన పని అయిపోయిందని సుధాకర్ ఎప్పుడూ భావించలేదు. వారి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని భావించారు. తన తల్లి జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.10 లక్షలను వెచ్చించి నెల్లూరు నగరం వేదాయపాళెంలో ఉన్న సొంతింట్లో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేశారు. పైకప్పునకు సోలార్ సిస్టమ్ పెయింటింగ్‌ను వేయించారు. సైన్స్ డిక్షనరీలు, మైక్రోస్కోపులు, ప్రొజెక్టర్లు, టెలిస్కోప్‌లు అందుబాటులో ఉంచారు. ప్రతి ఆదివారం ఇక్కడికి పిల్లల ఆహ్వానించి కొత్త విషయాలు నేర్పిస్తున్నారు. ఏవీఎం కిడ్స్ సైన్స్ కార్నర్ ద్వారా 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు అన్ని రకాల ప్రయోగాలు సులువుగా చేసేందుకు సహకారం అందిస్తున్నారు. ఇంకా వైజ్ఞానిక ప్రదర్శనల సందర్భంగా తన శిష్యులు బహుమతులు తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు.

పాఠశాలలో సైన్స్ క్లబ్

సైన్స్‌పై మక్కువ పెంచుకుంటే నేటి విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా మారేందుకు దోహదపడుతుందనేది సుధాకర్ అభిమతం. అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నారు. తాను పని చేసే జెడ్పీ హైస్కూల్లో సర్ సీవీ రామన్ పేరు మీద సైన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా చేపట్టిన సామాజిక, పర్యావరణ, వైజ్ఞానిక కార్యక్రమాల నివేదికలను పరిశీలించిన విప్‌నెట్ వారు వరుసగా మూడు పర్యాయాలు నాసా పరిశోధనల్లో పాలుపంచుకునే అవకాశం కల్పించారు. క్లబ్‌కు షార్ అభినందనలు కూడా లభించడం విశేషం. నాసా నుంచి ప్రశంసాపత్రం కూడా ఈ క్లబ్ పొందింది. పర్యావరణ హితం కోరుతూ పిల్లల ద్వారా క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు.


గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సుధాకర్ (ఫైల్)


స్కూల్లోని సైన్స్ క్లబ్‌లో పిల్లలకు పాఠాలు బోధిస్తూ..

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలి. అందుకోసం నా వంతు కృషి చేస్తున్నా. చురుకైన విద్యార్థులుంటే వారికి ఆర్థికంగా సహకారం కూడా అందించడం జరుగుతుంది. సైన్స్‌పై ఏర్పడిన మక్కువతో రూ.లక్షల నిధులు వెచ్చించి మ్యూజియం ఏర్పాటు చేశాను.

– ఏవీ సుధాకర్, సైన్స్ టీచర్, పొదలకూరు

పోటీ పడుతూ..

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పొదలకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బహుమతులు సాధిస్తుంటారు. సుధాకర్ వారికి ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తుంటారు. ఈయన 5వ తరగతి చదివే రోజుల్లో జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనల్లో పాల్గొని మొదటి స్థానం సాధించారు. అప్పటి నుంచి ఈ సబ్జెక్ట్‌పై మక్కువ పెంచుకున్నారు. 2002 సంవత్సరంలో సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన సుధాకర్ సులభతర బోధనలో దిట్టగా మారారు. 2006 నుంచి ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రశ్నపత్రాల తయారీ, కెమిస్ట్రీ కిట్ డిజైన్, నాసాలో గ్రహశకలాలపై పరిశోధన బృందంలో సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయి ప్రదర్శనలు, సదస్సుల్లో పాల్గొంటున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డును కూడా సుధాకర్ సాధించారు.


ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

క్లుప్తంగా

ఘనంగా గణేశ్ నిమజ్జనం



విడవలూరు : మండలంలోని పార్లపల్లి గ్రామంలో వినాయకుని నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి వద్ద ఏర్పాటు చేసిన 18 కేజీల లడ్డూను వేలంపాట వేశారు. అనంతరం స్వామివారిని ఉత్సవంగా ఊరేగిస్తూ మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పరిశిగాని మల్లికార్జునగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు

కోవూరు : ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పలువురు నిందితులను ఎస్సై రంగనాథ్‌గౌడ్ హెచ్చరించారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్‌లో పలువురు రౌడీషీటర్లతో ఆయన ఆదివారం మాట్లాడారు. కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ముత్తుకూరు: కృష్ణపట్నం అదానీ పోర్టులో మూసివేసిన కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ముత్తుకూరులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రచార జాతలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 – 26 నాటికి 55 లక్షల కంటైనర్ బాక్సుల ఎగుమతి, దిగుమతులు ఉంటాయని అంచనా వేసి అనుమతులు పొందారని గుర్తు చేశారు. దీని నిర్వహణకు 1,160 ఎకరాల భూమిని కేటాయించుకున్నారని తెలిపారు. అయితే, ఈ భూమిని బొగ్గు, ఐరన్‌ఓర్ నిల్వకు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఈనెల 16వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాడి గోపాల్, పారిశ్రామిక క్లస్టర్ అధ్యక్షుడు గడ్డం అంకయ్య, గోడ భాస్కర్, గోగుల శ్రీనివాసులు, నక్కా శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు పండిట్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మోహన్

సంగం: సంగం మండలం దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండింట్ తాటికొండ మోహన్ జాతీయ నంది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండింట్ మోహన్‌కు తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రతినిధులు నాసా సాంబశివరావు, శాంతిబాయ్, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు జాతీయ నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

- ఉదయగిరి: ఉదయగిరి మండలం శకునాలపల్లికి చెందిన కె.శ్రీనివాసులు జాతీయ నంది పురస్కారాన్ని అందుకున్నారు. సమాజసేవ, అన్నమయ్య కీర్తనల అలాపన, సంగీత విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపినందుకు పురస్కారం వరించింది.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పొదలకూరు: పట్టణంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలువు నిర్వహించి నెల రోజులు కావడంతో మహిళా భక్తులు ఆయల ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా భక్తులు మేళతాళాల నడుమ దేవస్థానానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురవాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కమనీయం శ్రీనివాసుని కల్యాణం



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. శ్రవణా నక్షత్రం సందర్భంగా వేద పండితులు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శ


నారాయణ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కాకాణి

మనుబోలు: మండలంలోని వడ్లపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టేటి నారాయణ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం వడ్లపూడికి చేరుకుని నివాళులర్పించారు.

నారాయణ కుమారులు మురళి, అంకయ్య, మేనల్లుడు సురేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాకాణి వెంట నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులున్నారు.

టీడీపీ అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు


ఎస్సై హనీఫ్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నిరాధారమైన అనుచిత వ్యాఖ్యాలు చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎస్సై హనీఫ్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల విలువైన ఇసుక, తెల్లరాయిని కాకాణి దోపిడీ చేశాడని టీడీపీ మండలాధ్యక్షుడు టి.మస్తాన్‌బాబు, కార్యకర్త ఎ.అనిల్ కుమార్‌రెడ్డిలు ఎలాంటి ఆధారాలు లేకుండా చెప్పారన్నారు. సస్పెండ్ అయిన పూర్వ తహసీల్దార్ స్వాతి రూ.15 కోట్ల అక్రమార్జనలో కాకాణికి వాటా ఉందని పేర్కొన్నారని చెప్పారు. ఈ అంశాలపై పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపించడమే కాక సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వారు చేస్తున్న ప్రచారంపై కేసు నమోదు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు కోనం చినబ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, జి.వేణుగోపాల్‌రెడ్డి, హేమంత్, ప్రసాద్, ఖాదర్, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

ఏచూరి మరణం తీరనిలోటు


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

కోవూరు : కోవూరులోని సీతాపోలయ్య భవనంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం భారత వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు షేక్.అఫ్రోజ్, గండవరపు శేషయ్య, విజయ్‌కుమార్, జక్కా శేషమ్మ, బుజ్జయ్య, బాబు, సుబ్బారావు, పెద్దన్న, శ్రీనివాసులు, రమేష్, సురేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

వెంకటాచలం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని గొలగమూడి వద్దనున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు కిరణ్‌కుమార్, అంకయ్య, మనోజ్‌కుమార్, రవి, కిశోర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం


అవార్డులు అందుకున్న టీచర్లు

వెంకటాచలం: టీచర్స్ డే సందర్భంగా మండలంలోని సర్వేపల్లి వద్దనున్న ఎస్‌ఆర్‌కే ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు ఏపీపీయూఎస్‌ఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (ఏపీపీయూఎస్‌ఎంఏ) జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులకు అనుగుణంగా పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌కే స్కూల్ కరస్పాండెంట్ దినేష్‌రెడ్డి, పలు స్కూళ్ల యజమానులు పాల్గొన్నారు.

పాస్టర్లకు అండగా ఉంటాం

మనుబోలు: పాస్టర్లకు అండగా నిలుస్తామని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ గడ్డం హనోక్ అన్నారు. ఆదివారం స్థానిక లాజరస్ చర్చిలో మండల అసోసియేషన్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.


నూతన కమిటీ

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

కొడవలూరు : దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ అన్నారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యనభ్యసించే ఇంజినీరింగ్ విద్యార్థులపై దేశ ప్రగతి ఉంటుందన్నారు. విద్యార్థులు వారు ఎంచుకున్న విభాగంలో ప్రతిభ కనబరిచి సమాజ శ్రేయస్సుకు దోహదపడాలన్నారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, అకాడమిక్ డీన్ ఎ.హజరత్తయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అధ్యాపకులు

పొణకా కనకమ్మకు ఘన నివాళి


కనకమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సిబ్బంది

ఇందుకూరుపేట : స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ వర్ధంతిని పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహం వద్ద ఆశ్రమ సభ్యులు, విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంధర్‌రెడ్డి మాట్లాడారు. గాంధీ శిష్యురాలిగా ఆమె చేసిన సేవలు ఎనలేనివన్నారు. గాంధీ ఆశ్రమం కోసం 13 ఎకరాల స్థలాన్ని విరాళంగా అందజేసినట్లు గుర్తుచేశారు. ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆశ్రమ కమిటీ సభ్యుడు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం సర్వం త్యాగం చేసిన వీర వనిత కనకమ్మ అని కొనియాడారు. ఆమె జీవితాన్ని పాఠ్యాంశంగా మార్చి మహిళా స్ఫూర్తికి ప్రభుత్వం ముందుకొచ్చినప్పుడే ఆమెకు సరైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ శిక్షకులు పాల్గొన్నారు.

శిథిలమైన తెలుగుగంగ క్వార్టర్స్


పులికల్లు క్వార్టర్స్‌లో గోడలు కూలిన రేకుల షెడ్డు


పిచ్చిమొక్కలతో నిండిన క్వార్టర్స్

పొదలకూరు: మండలంలోని పులికల్లు గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ క్వార్టర్స్ శిథిలమయ్యాయి. పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. పడిపోయిన గోడలు, కూలిన భవనాలు దర్శనమిస్తున్నాయి. 1986లో కండలేరు మట్టికట్ట నిర్మాణ సమయంలో పులికల్లును తెలుగుగంగ సబ్‌డివిజన్‌గా ఏర్పాటుగా చేసి క్వార్టర్స్, డీఈ కార్యాలయాన్ని నిర్మించారు. జనాలతో సందడిగా ఉండే డీఈ కార్యాలయం మూడు దశాబ్దాలకుపైగా కళావిహీనంగా మారింది. ఇక్కడ సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఎత్తివేయడంతో క్వార్టర్స్‌లో ఉన్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఫలితంగా దొంగలు అందినకాడికి ఇనుము, రేకులు, ఇతర గృహోపకరణ సామగ్రిని చోరీ చేశారు.

ఇలా చేస్తే..

నిరుపయోగంగా ఉన్న తెలుగుగంగ క్వార్టర్స్‌ను గోదాములుగా ఉపయోగించుకునేందుకు అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే కొన్ని క్వార్టర్స్ వాడుకోవచ్చు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు, ఇతర పంటలను కొద్దికాలం నిల్వ చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే రైతులకు శిథిలమైన క్వార్టర్స్ కొంతవరకు ఉపయోగపడుతుంది.